క్లుప్తంగా

దావులూరు వద్ద పోలీసుల తనిఖీలు



కంకిపాడు: మండలంలోని దావులూరు టోల్ గేట్ వద్ద పోలీసులు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ కె.సుధాకర్ నేతృత్వంలో సిబ్బంది విజయవాడ-మచిలీపట్నంలో రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేసి వాహనదారుల నుంచి వివరాలను సేకరించారు.

అందరిలోనూ అనంత పరమాత్మ చైతన్యం



పెనమలూరు: ప్రతి వ్యక్తిలోనూ అనంత పరమాత్మ చైతన్యం ఉందని శివరాజయోగి కృష్ణస్వామి అన్నారు. కానూరులోని శ్రీనివాసకల్యాణ మండపంలో మహదేవ్ శక్తి సమస్థాన్ ఆధ్వర్యంలో శ్రీ విద్యమహాప్రాణోపదేశ కార్యక్రమాన్ని శివరాజయోగి శిష్యులు నిర్వహించారు. ఈ సందర్భగా శివరాజయోగి కృష్ణస్వామి ఉపదేశిస్తూ ప్రతి వ్యక్తిలో అనంత పరమాత్మ చైతన్యం ఉందని, దానిని మేల్కొలపడం అందరికీ సాధ్యమేనని అన్నారు. ఈ సందర్భంగా 500 మంది భక్తులకు మహాప్రాణ విద్యను, శ్రీ విద్య మహాప్రాణోపదేశాన్ని ప్రసాదించారు. స్వామీజీ భక్తులకు హంస యోగం ఇచ్చి రుద్రాక్ష ప్రసాదం పంపిణీచేశారు.

9 మంది జూదరులు అరెస్టు

పెనమలూరు: కోడి పందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మందిని పెనమలూరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోరంకి-నిడమానూరు రోడ్డులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మంది పట్టుబడ్డారు. వారి వద్ద రెండు పుంజులు, రెండు కత్తు, రూ.1750 నగదును స్వాధీనంచేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

పేకాట కేసులో నలుగురు

పెనమలూరు: పేకాడుతున్న నలుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. మండలంలోని యనమలకుదురు లంబాడీపేటలో పేకాడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంపై పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు పేకాడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద రూ.5,990 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

స్వచ్ఛత అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప పురపాలక సంఘంలో మహిళలకు ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు అందజేయనున్నామని, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేయాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.ప్రకాశరావు సూచించారు. ఆయన ఈ వివరాలను సోమవారం వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్‌మిషన్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు అందజేయనున్నామని ప్రకటించారు. సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధి, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి, పొడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారీ విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వివరించారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఏప్రిల్ ఐదో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ ఐదో తేదీన అవార్డులు ప్రదానం చేస్తామని కమిషనర్ ప్రకాశరావు తెలిపారు.



కంకిపాడు మండలం మంతెనలో మినుము గూళ్లు ఆరబెడుతున్న కూలీలు



కంకిపాడు మండలం కోలవెన్నులో పనల మీదే ఉన్న మినుము పంట

రైతుల పొలంబాట

అకాల వర్షం బారిన పడిన అపరాలను రక్షించుకునేందుకు రైతులు పొలంబాట పట్టారు. కోస్తాంధ్రపై ఏర్పడి ద్రోణి ప్రభావంతో మూడు రోజులుగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. మినుము, పెసరతోపాటు మొక్కజొన్న, పసుపు పంటలకు నష్టం వాటిల్లింది. ఈ పంటల సంరక్షణకు రైతులు చర్యలు తీసుకున్నారు. వాతావరణం తెరిపివ్వడంతో పనల మీద, రాశులు మీద ఉన్న మినుము, పెసర పంటను ఆరబెట్టి మార్కెట్‌కు తరలించే పనుల్లో రైతులు, కూలీలు నిమగ్నమయ్యారు.

– కంకిపాడు



కోలవెన్నులో బూజుపట్టిన మినుము పనలతో రైతు కూలీ

మానసిక వికాస కేంద్రానికి సిమెంట్ వితరణ

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో ఉన్న స్పందన మానసిక వికాస కేంద్రంలో భవన నిర్మాణానికి ఉత్తరప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఏవీ రాజమౌళి 200 సిమెంట్ బస్తాలను ఇచ్చారు. ఉంగుటూరు మండల మాజీ వైస్ ఎంపీపీ అర్నేపల్లి సింహాచలం సోమవారం సిమెంట్ బస్తాలను మానసిక వికాస కేంద్రం ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ అత్కూరుకు చెందిన రాజమౌళిని గతంలో కలిసినప్పుడు వికాస కేంద్రం ద్వారా దివ్యాంగులైన విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సేవలను వివరించినట్లు చెప్పారు. సేవా భావంతో నడుపుతున్న తమ కేంద్రానికి అండగా నిలుస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన మాతృమూర్తి అడుసుమిల్లి లీలారత్నకుమారి జ్ఞాపకార్థం నూతన



సిమెంట్ బస్తాలను అందజేస్తున్న సింహాచలం

భవనానికి సిమెంట్ బస్తాలను అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా రాజమౌళికి వికాస కేంద్రం ద్వారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కేంద్రం కార్యదర్శి ఎస్.రజిత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం



మద్దూరులో మినుము పంటను పరిశీలిస్తున్న రామచంద్రరావు, విజయ్‌బాబు తదితరులు

కంకిపాడు: అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు అన్నారు. మండలంలోని మంతెన, మద్దూరు తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారులతో కలిసి వారు సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో మినుము, పెసర, మొక్కజొన్న, పసుపు పంటలను పరిశీలించారు. రామచంద్రరావు, విజయ్‌బాబు మాట్లాడుతూ అకాల వర్షం రైతులకు నష్టాలను మిగిల్చిందన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి సమర్థంగా నివేదిక తయారు చేయాలన్నారు. ప్రతి ఒక్క రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆందోళన చెందొద్దని ధైర్యం చెప్పారు. మండల వ్యవసాయాధికారి పి.ఎం.కిరణ్, మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కంకిపాడు: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఈడుపుగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మావతి సూచించారు. నవ జీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం పద్మావతి మాట్లాడుతూ మంచి, చెడు విచక్షణ కోల్పోయే అవకాశం ఉందని, మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ జె.ఆంజనేయులు మాట్లాడుతూ.. తాత్కాలిక సంతోషం కోసం జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డీ ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తెచ్చుకోవచ్చన్నారు. బాలభవన్ నూజివీడులో డీఎడిక్షన్ సెంటరు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ జె.వాణి, మహిళా సంరక్షణ కార్యదర్శి జి.జయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ పాఠశాల హెచ్ఎం పద్మావతి

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు



భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో ఉన్న శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం మాసశివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. సాయంత్రం భక్తబృందంచే భజన కార్యక్రమం జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుదల

హనుమాన్‌జంక్షన్ రూరల్: నవధాన్యాలు సాగు ద్వారా భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం విభాగం ముఖ్య శిక్షకుడు ఎంటీ గంగరాజు అన్నారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో బాపులపాడు మండల తిప్పనగుంటలో రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నవధాన్యాలు సాగు వల్ల సేంద్రియ కర్బనం, జీవన వైవిధ్యం పెరుగుతుందని చెప్పారు. నవధాన్యాల సాగుతో ఆదాయంతో పాటుగా ఖరీఫ్ సీజన్ నాటికి నేలలో అధిక పోషకాలు లభిస్తాయని వివరించారు. వీఏఏ విజయ్‌కుమార్, వీవోఏ బి.సునీత, ఎంపీటీసీ సభ్యురాలు కె.పద్మ, ఎస్ఎఫ్ ఎల్2 జి.నాగమణి, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

నీటి కాసులపై అప్రమత్తంగా ఉండాలి



కంకిపాడు: నీటి కాసులపై అప్రమత్తంగా ఉండాలని ఉప్పులూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ సూచించారు. కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 80 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ.. నీటి కాసులు వచ్చిన వారిలో కళ్లు నొప్పిగా ఉండటం, ఎర్రబడటం, నీరు కారటం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వీటిని నీటికాసులు లక్షణాలను గుర్తించి సకాలంలో వైద్యం పొందాలని సూచించారు. వైద్య సిబ్బంది పి.శివదుర్గ, టి.మంజుఫిల్మినా, బి.శ్రీదివ్య, సీహెచ్.సంధ్యారాణి, సచివాలయ సిబ్బంది అబ్దుల్ కాలిక్, శివ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలి

డీపీఓ నాగేశ్వర నాయక్

కంకిపాడు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ ఆదేశించారు. మండలంలోని పునాదిపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్మీకం పోస్టు తయారీ, పిట్స్, వ్యర్థాలను వేసే పిట్‌లను నిర్వహించే తీరును పరిశీలించారు. పిట్స్ (కుండీ)లో చెట్ల ఆకులు వేయటం వల్ల ఉపయోగం తక్కువగా ఉంటుందని, త్వరగా కుళ్లిపోయే వాటిని మాత్రమే పిట్స్‌లో వేసుకోవాలని డీపీఓ సూచించారు. కంపోస్టును తయారు చేసి విక్రయించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ బాధ్యతతో చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో శిక్షణ కేంద్రాల్లో ఒకటిగా ఉన్న పునాదిపాడు సంపద కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలని, ఇతర ప్రాంతాల నుంచి శిక్షణకు వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని కోరారు. ఈ తనిఖీలో ఈఓ బి.వెంకటేశ్వరరావు, మునిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పునాదిపాడులో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీఓ నాగేశ్వరనాయక్

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెనమలూరు: మండలంలోని యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు, అమ్మవారికి అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. శివసాధంలో అమ్మవారికి భక్తులు కుంకుమ పూజ చేశారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీరామలింగేశ్వరస్వామి

పేద విద్యార్థికి మారుబోయిన ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత చదువులకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఇతోధికంగా సాయం అందిస్తున్నట్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. జలంధర్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ నాల్గవ సంవత్సరం చదువుతున్న గరికపాటి అజయ్‌సాయికి సోమవారం ఆయన రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో అజయ్ సాయి తల్లి సత్యవతికి ఈ మొత్తాన్ని అందించారు. గరికపాటి అజయ్ సాయి తండ్రి రాంబాబు అనారోగ్యంతో మరణించటంతో గత నాలుగేళ్లుగా అగ్రికల్చర్ బీఎస్సీ చదువుకు అవసరమైన ఫీజును మారుబోయిన చెల్లిస్తున్నారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చక్కా సుబ్బారావు, బెజవాడ శ్రీరామ్మూర్తి,సభ్యులు గంటా సత్యనారాయణ, నారగాని కొండలరావు, పాట్లూరి శేషాచలం, దయాల ప్రభాకరరావు పాల్గొన్నారు.



విద్యార్థి తల్లి సత్యవతికి ఆర్థికసాయం అందిస్తున్న మారుబోయిన కోటేశ్వరరావు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేదలందరికీ నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన ఆర్థికసాయాన్ని సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన షేక్ మహబూబి కాళ్లకు శస్త్రచికిత్స చేయించుకోవటంతో ఆమెకు రూ.70 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. రామన్నగూడెంకు చెందిన కగ్గా రామరాజు అనారోగ్యానికి గురై ఆస్పత్రి శస్త్రచికిత్స చేయించుకోవటంతో రూ.2 లక్షల సీఎం సహాయనిధి మంజూరు చేశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యుడు పడకల కోటేశ్వరరావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ తానీషా, పార్టీ నాయకులు కిరణ్‌మూర్తి, తూము హరిబాబు, వడ్లమూడి ప్రసాద్ పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడుకోవడం మన బాధ్యత

గన్నవరం: నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేసరపల్లి గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక పిలుపునిచ్చారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా సోమవారం ఎన్టీఆర్ పశువైద్య కళాశాల ఎన్‌సీసీ వింగ్ ఆధ్వర్యంలో ఊర చెరువు పరిసరాల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి సర్పంచ్, అధికారులు చెరువు చుట్టూ చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని చెరువులు కాలుష్యం బారిన పడకుండా పరిరక్షించుకోవాలని చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులు గ్రామంలో ప్రధాన సాగునీటి వనరైన చెరువును శుభ్రం చేయడం అభినందనీయమన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీదేవి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ సంజయ్ జాదవ్, లెఫ్టినెంట్ డాక్టర్ ఎల్.జయబాల్, వార్డు సభ్యులు మూల్పూరి మాధవన్, జంపన సుబ్బమ్మ, పాస్టర్ అశోక్‌జాన్, ఎన్‌సీసీ ఆఫీసర్లు బ్రహ్మదేవ్, యుగంధర్, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.



చెరువును శుభ్రం చేస్తున్న సర్పంచ్, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు

హెచ్ఐవి బాధితులకు ఉచితంగా హెపటైటీస్-బి వ్యాక్సిన్

గన్నవరంరూరల్: హెచ్ఐవి బాధితుల రక్షణకు హెపటైటీస్-బి వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నట్లు చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వ్యాధుల నియంత్రణకు, ముందస్తు జాగ్రత్తలకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డాక్టర్ భవాని, ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ ఉమాకాంత్ పాల్గొన్నారు.

పేదల జీవనోపాధికి వైఎన్ఆర్ ట్రస్టు చేదోడు

- మూడు నియోజకవర్గాల్లో విస్తృత సేవలు
- పలువురికి బడ్డీకొట్లు, కుట్టుమిషన్లు, కూరగాయల బండ్లు అందజేత
- పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, చిన్నారులకు వైద్య సహాయాలు
- నెలకు రూ.3 లక్షలు సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్న జయప్రకాష్



బడ్డీకొట్టు అందజేస్తున్న జయప్రకాష్(ఫైల్)



విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ (ఫైల్)

రామవరప్పాడు: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న నానుడిని నిజం చేస్తున్నారు ఎనికేపాడు నివాసి యలమంచిలి జయప్రకాష్. తాను సంపాదించే రూపాయిలో పావలా వంతు సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు తన వంతు అండగా నిలబడాలనే సంకల్పంతో కుట్టుమిషన్లు, ఇస్త్రీ బండ్లు, కూరగాయల బండ్లు, బడ్డీ కొట్లు, వికలాంగులకు వీల్ చైర్లు, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఆర్థిక సహాయాలు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వేసవి కాలంలో మజ్జిగ చలివేంద్రాలు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

సేవా కార్యక్రమాలకు అంకురార్పణ ఇలా...

యలమంచిలి జయప్రకాష్ చిన్నతనం నుంచీ అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. తన తండ్రి శివన్నారాయణ ట్రావెల్స్ వ్యాపారం దెబ్బతినడంతో అనేక ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. కష్టకాలంలో తెలిసిన వారు, బంధువులు సైతం చేయి అందించకపోవడం మరింత కృంగదీసింది. ఈ పరిస్థితుల నుంచి క్రమేణా తన స్వయం కృషితో పలు వ్యాపారాలు విజయవంతంగా నిర్వహించి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. తాను అనుభవించిన కష్టాలను ఏ మాత్రం మరిచి పోకుండా మనకు ఉన్నప్పుడు పలువురికి సహాయం చేయాలన్న ఆలోచన జయప్రకాష్‌కు అప్పుడే మెదిలింది. అప్పటి నుంచి తాను సంపాదించిన రూపాయిలో పావలా వంతు సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు. ముఖ్యంగా జీవనోపాధికి అవకాశం కల్పిస్తే పేదలు ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్న ఆలోచనతో స్వయం ఉపాధికి అవసరమయ్యే సహాయాలు చేస్తున్నారు.

వైఎస్ఆర్ చారిటీస్ స్థాపించి..

తొలుత మాజీ మంత్రి దేవినేని నెహ్రూ సూచన మేరకు జయప్రకాష్ 2005లో లయన్స్‌క్లబ్‌లో చేరి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. 2015లో జయప్రకాష్ తండ్రి యలమంచిలి శివన్నారాయణ మరణించడంతో తన తండ్రి పేరు మీద వైఎస్ఆర్ చారిటీస్‌ను స్థాపించి సేవా కార్యక్రమాలను విస్తృత పరుస్తున్నారు. మొదట్లో రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి, కేసరపల్లి గ్రామాల్లో చారిటీస్ పేరు మీద సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పేద మహిళల స్వయం ఉపాధికి కూరగాయలు, ఇస్త్రీ బండ్లు, బడ్డీకొట్లు, కుట్టుమిషన్లు, వృద్ధులకు వైద్య శిబిరాలు నిర్వహించి మన్ననలు పొందారు. క్రమేణా గన్నవరం నియోజకవర్గంతో పాటు పెనమలూరు, విజయవాడ తూర్పు నియోజకవర్గాల్లో కూడా తన చారిటీస్ పేరు మీద అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

సేవ చేయడం వరంలా భావిస్తున్నా



వైఎస్ఆర్ చారిటీస్ ద్వారా సేవ చేసే అవకాశం రావటం వరంలా భావిస్తున్నా. చిన్నతనంలో ఎదుర్కొన్న కష్టాల ఫలితమే సేవా మార్గం వైపు కదిలేలా చేశాయి. మూడు నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు నెలకు సుమారు రూ.3 లక్షలు వెచ్చిస్తున్నా. ఎవరి సాయం, విరాళాలు తీసుకోకుండా సొంత ఖర్చుతోనే చారిటీస్‌ను నడిపిస్తున్నా. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, అర్హులైన పేదలకు జీవనోపాధి కల్పించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను.

–యలమంచిలి జయప్రకాష్,
దాత, వైఎస్ఆర్ చారిటీస్ వ్యవస్థాపకుడు

వర్గీకరణపై నమ్మించి మోసం చేసిన బీజేపీ



ప్రసంగిస్తున్న కృష్ణమాదిగ

గన్నవరం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విషయంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. స్థానిక కొత్తపేటలోని బీసీ కమ్యూనిటీ హాలులో సోమవారం మాదిగల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ వంద నెలలైనా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. యూపీఏ ప్రభుత్వంలో వర్గీకరణకు అనుకూలంగా లేఖలు రాసిన బీజేపీ పెద్దలు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మాదిగలు, మాదిగ ఉపకులాలను ఏకతాటి పైకి తీసుకువచ్చి వర్గీకరణ సాధనకు కృషిచేస్తామని తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద దీక్ష, వచ్చే నెల 3న హైదరాబాద్, విజయవాడ బీజేపీ కార్యాలయాల ముట్టడి, 4న నగరాల దిగ్బంధం కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. సంఘ నాయకులు మంద వెంకటేశ్వరరావు, ముమ్మడివరపు చినసుబ్బారావు, మంద వేణుబాబు, కోట దానియేలు తదితరులు పాల్గొన్నారు.